

# బాలకృష్ణకు మాత్రమే అది సాధ్యమైంది



అగ్రహీరో బాలకృష్ణ ప్రస్తుతం తన 109వ సినిమా పూర్తి చేసే పనిలో ఉన్నారు. 'ఎన్‌బీకే 109' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రానికి 'వీరమాస్' అనే టైటిల్ అనుకుంటున్నట్టు వార్తలొస్తున్నాయి. అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఇందులో బాలయ్యను బాబీడియోల్ విలన్‌గా ఢీకొట్టనున్నారు. ఇద్దరు పాత్రలూ 'నువ్వా నేనే' అనేలా ఉంటాయని సమాచారం. సరిగ్గా ఇంక మూడ్నెల్లు.. అంటే అక్టోబర్ 10న దసరా కానుకగా ఈసినిమా విడుదల కానుంది. ఇదిలావుంటే బాలయ్య వచ్చే నెలలో నటుడిగా 50ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. ఆయన తొలి చిత్రం 'తాతమ్మకల' విడుదలై వచ్చే నెల 30 నాటికి అక్షరాలా 50ఏళ్లు. ఒక హీరో వారసుడిగా తెరంగేట్రం చేసి, ఇన్నేళ్లుగా కెరీర్ కొనసాగిస్తూ, ఇప్పటికీ స్టార్‌హీరోగా చెలామణీ కావడం బాలకృష్ణకు మాత్రమే సాధ్యమైంది. ఓ విధంగా ఇది దేశంలోనే రికార్డ్. మొత్తానికి అన్ని విధాలుగా విజయవంతమైన కెరీర్‌ని కొనసాగిస్తున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన తనయుడు, నటవారసుడు మోక్షజ్ఞ కూడా ఈ ఏడాదే హీరోగా పరిచయం కానుండటం విశేషం.

# నా కల నెరవేరింది



చెన్నైలోని పోయెస్ గార్డెన్ సంపన్నులు నివసించే ప్రాంతంగా పేరు పొందింది. సినీ, రాజకీయ ప్రముఖుల్లో చాలా మందికి ఆ ప్రాంతంలో విలాసవంతమైన భవంతులున్నాయి. తమిళ అగ్రహీరో ధనుష్ కొన్ని నెలల క్రితం 150కోట్ల భారీ వ్యయంతో అధునాతన సౌకర్యాలతో అక్కడ ఓ ఇల్లు కట్టుకున్నారు. ఇంటి నిర్మాణానికి అంత డబ్బు ఖర్చు పెట్టడంతో చెన్నై సినీ వర్గాల్లో ఈ హౌస్ హాట్‌టాపిక్‌గా మారింది. తాజాగా ఈ విషయం గురించి ధనుష్ తన తాజా చిత్రం 'రాయన్' ఆడియో వేడుకలో స్పందించారు. 'నేను చిన్నప్పట్నుంచి రజనీకాంత్‌సార్ వీరాభిమానిని. నా పదహారేళ్ల వయసులో పోయెస్ గార్డెన్‌లోని ఆయన ఇంటిని చూసి ఆశ్చర్యపోయాను. అద్భుతమనిపించింది. ఎప్పటికైనా ఆ స్థాయిలో ఇల్లు కట్టుకోవాలనే బలమైన కోరిక కలిగింది. జీవితంలో బాగా సక్సెస్ అయితే అదే తరహాలో ఇల్లు కట్టుకోవాలనుకున్నా. ఆ కలను ఇలా నిజం చేసుకున్నా. నా అభిరుచులను ప్రతిబింబించేలా ఇల్లు డిజైన్ చేసుకున్నా.' అని ధనుష్ చెప్పుకొచ్చారు.

# వస్తే మాత్రం వదిలేదిలేదు

ప్రస్తుత హీరోయిన్లలో నంబర్‌వన్ ఎవరు? అంటే ఎక్కువమంది నుంచి వచ్చే సమాధానం 'సాయిపల్లవి'. తను ఏ సినిమా పడితే ఆ సినిమా చేయదు. తను చేయదగ్గ సినిమా మాత్రమే చేస్తుంది. పరిధి దాటి ప్రవర్తించదు. పద్ధతిగా ఉండే పాత్రలే చేస్తుంది. సాయిపల్లవిని కోట్లాదిమంది ఆరాధిస్తున్నారంటే కారణం.. ఆమె అందం, అభినయం, యాటిట్యూడే. ప్రస్తుతం తెలుగులో 'తండేల్' సినిమాలో నటిస్తున్న సాయిపల్లవి, హిందీ 'రామాయణ్'లో సీత పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల తానిచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాను ఎలాంటి పాత్రలను చేయాలనుకుంటున్నదో వివరించింది. 'ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేస్తే బోరింగ్‌గా ఉంటుంది. అన్ని రకాల పాత్రలు చేసినప్పుడే పరిపూర్ణమైన నటిగా మిగలగలం. కొంతవరకూ నేను లక్కీ. చేసిన సినిమాలన్నింటిలో 'కథానాయిక' అనదగ్గ పాత్రలే చేశాను. చేసినవన్నీ మంచి కథలే. నటిగానే కాక, నాట్యతారగా కూడా నాకవి గుర్తింపునిచ్చాయి. కానీ ఇంకా నా ఆకలి తీరలేదు. మంచి పాత్రలు చేయాలి. భిన్నమైన కేరక్టర్స్‌లో నటించాలి. ముఖ్యంగా కామెడీ నేపథ్యం ఉన్న సినిమాల్లో నటించాలని ఉంది. అందులో నేను కామెడీ చేయాలి. నిజానిక్కూడా ఇప్పటివరకూ ఆ తరహా పాత్రలు చేయలేదు. వస్తే మాత్రం వదిలేదిలేదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి.

# అసాధారణ ప్రయాణం



'మహానటి' 'సీతారామం' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు మలయాళ అగ్రహీరో దుల్కర్ సల్మాన్. ఆయన నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. 1980–90 దశకంలో జరిగే ఈ కథలో ఓ సాధారణ బ్యాంక్ క్యాషియర్ అసాధార ప్రయాణాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఇందుకోసం 80ల నాటి ముంబయి మహానగరాన్ని హైదరాబాద్‌లో వేసిన సెట్‌లో రీక్రియేట్ చేశామని, ఆ కాలం నాటి బ్యాంక్‌లను పోలి ఉండే సెట్‌ను కూడా తీర్చిదిద్దామని చిత్ర బృందం పేర్కొంది. సహజత్వం ఉట్టిపడేలా 1980ల నాటి ముంబయి మహా నగరాన్ని సెట్‌లో అందంగా పునఃసృష్టించామని దర్శకుడు తెలిపారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందిస్తున్నారు.

# ఒళ్లు గగుర్పొడిచేలా బృంద



త్రిష ప్రధానపాత్రలో రూపొందుతోన్న క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'బృంద'. త్రిష నటిస్తున్న తొలి వెబ్‌సిరీస్ ఇదే కావడం గమనార్హం. సూర్యమనోజ్ వంగాల దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సిరీస్ ఆగస్ట్ 2న సోనీ లీవ్‌లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, మరాఠి, బెంగాలీ, హిందీ భాషల్లో ఈ సిరీస్‌ని విడుదల చేయనున్నారు. ఈ సిరీస్ గురించి దర్శకుడు మాట్లాడుతూ 'అనూహ్యమైన మలుపులతో ఉత్కంఠను రేకెత్తించే సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ ఇది. ఇందులోని డ్రామా, క్రైమ్, మిస్టరీ అంశాలు ప్రేక్షకుల ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి. బృందగా త్రిష శక్తిమంతమైన పాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్రలో ఎన్నో లేయర్లుంటాయి. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ కథలకు సరైన నిర్వచనం ఈ సిరీస్.' అని నమ్మకం వ్యక్తం చేశారు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్రవిజయ్, ఆనంద్‌సామి, రాకేందుమౌళి తదితరులు నటిస్తున్న సిరీస్‌కి కెమెరా: దినేష్ కె.బాబు, సంగీతం: శక్తికాంత్ కార్తిక్.

# డివోషనల్ 'కళింగ'



స్వీయ దర్శకత్వంలో ధృవ వాయు హీరోగా నటిస్తున్న చిత్రం 'కళింగ'. ప్రగ్యా నయన్ కథానాయిక. మంగళవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్ మరియు ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. టైటిల్ పోస్టర్‌లో లక్ష్మీ నరసింహ స్వామి ఉగ్రరూపంలో దర్శనమిస్తుండగా, హీరో చేతిలో కాగడా పట్టుకొని కనిపిస్తున్నారు. పోస్టర్‌ను బట్టి డివోషనల్ థ్రిల్లర్ కథాంశమిదని అర్థమవుతున్నది. ఇప్పటివరకు రానటువంటి వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, కథలోని మలుపులు ఉత్కంఠను పంచుతాయని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాతలు: దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్.

# నాగమ్మ యాక్షన్ విన్యాసాలు



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఏస్తర్ నోరోనా తదితరులు ఇతర ప్రధాన పాత్రల్ని పోషించారు. పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఈ సినిమాలోని ఓ పాటను విడుదల చేశారు. ఈ సినిమాలో మంచు లక్ష్మి నాగులాపురం నాగమ్మగా శక్తివంతమైన పాత్రలో కనిపిస్తుందని, ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయని, పీరియాడిక్ డ్రామాగా ప్రేక్షకులను మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నామని నిర్మాత ఎమ్.ఎస్.కె తెలిపారు. అద్భుతమైన సోషియో ఫాంటసీ కథాంశమిదని, తన పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుందని, యాక్షన్ సీన్స్ కోసం చాలా కష్టపడ్డానని మంచు లక్ష్మి పేర్కొంది. ఈ కార్యక్రమంలో చిత్ర తారగణం అందరూ పాల్గొన్నారు.

# స్టైలిష్ కోడలుగారు



అందాలరాక్షసి, సోగ్గాడే చిన్నినాయన, భలేభలే మగాడివోయ్ సినిమాలతో డీసెంట్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు మెగా కోడలు లావణ్య త్రిపాఠి. కథానాయికగా గౌరవప్రదమైన పాత్రలు పోషించి, అంతే గౌరవంగా వరుణ్‌తేజ్‌ని వివాహమాడేసి ప్రస్తుతం ఇల్లాలిగా బాధ్యతలు నిర్వర్తించే పనిలో ఉన్నారామె. సినిమాలు చేసుకునే స్వేచ్ఛను కూడా మెగా ఫ్యామిలీ ఆమెకు కల్పించింది. మరి కథానాయికగా లావణ్య నుంచి ఇప్పటివరకూ ఎలాంటి అప్‌డేట్ రాలేదు. ప్రస్తుతమైతే అత్తగారికి వంటలో సాయం చేస్తూ, వరుణ్‌తో సినిమా ముచ్చట్లతో టైంపాస్ చేస్తూ, మధ్యమధ్య ఇన్‌స్టాలో కొత్తకొత్త ఫొటోలను షేర్ చేస్తూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు లావణ్య కొణిదెల త్రిపాఠి. రీసెంట్‌గా తన ఇన్‌స్టాలో లావణ్య ఓ ఫొటో షేర్ చేశారు. ఆ ఫొటోలో వైట్ ఫ్యాంట్, టీషర్ట్ ధరించి, వాల్ సపోర్ట్‌తో స్టైలిష్‌గా నిలబడ్డ లావణ్య స్టిల్ ప్రస్తుతం సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. ఈ ఫొటోతో పాటు 'తెలివైన శీర్షికలన్నీ అయిపోతున్నాయి' అని ఓ ఆసక్తికరమైన క్యాప్షన్ కూడా జత చేసింది. దీని భావం తెలీక ఆమె ఫాలోవర్స్ తలలు బాదుకుంటున్నారు. ఏదేమైనా లావణ్య స్టిల్ మాత్రం చూపరులను బాగా ఆకర్షిస్తున్నది. ప్రస్తుతం ఆమె నటించిన ఓ తమిళ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. పెళ్లయ్యాక కొత్త సినిమాలేవీ లావణ్య ఒప్పుకున్నట్టు లేదు.

# భావోద్వేగాల పేకమేడలు



వినోద్ కిషన్, అనూషకృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'పేకమేడలు'. ఈ చిత్రానికి దర్శకుడు నీలగిరి మామిళ్ల, నిర్మాత రాకేశ్ వర్రే. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు ఎంటర్‌టైన్‌మెంట్‌ని మిళితం చేసి ఈ సినిమా చేశామని దర్శకుడు తెలిపారు. ఇది కేవలం కామెడీ సినిమానే కాదని, జీవితంలో మగవారికి ఆడవాళ్లు ఇస్తున్న సహకారాన్ని ఈ కథ ద్వారా చర్చించడం జరిగిందని నిర్మాత చెప్పారు. ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల హీరోహీరోయిన్లు ఆనందం వెలిబుచ్చారు. రితిక శ్రీనివాస్, జగన్ యోగిరాజ్, అనూష నూతల, గణేశ్ తిప్పరాజు, నరేన్ యాదవ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: హరిచరణ్ కె., సంగీతం: స్మరణ్ సాయి, నిర్మాణం: క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్.



# క్రైమ్ థ్రిల్లర్ 'కేస్ నం.15'

అజయ్, రవిప్రకాష్, హర్షిణి, మాండవియా సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నం. 15'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో తడకల రాజేష్ తెరకెక్కించారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించామని, ప్రతి సన్నివేశం ఉత్కంఠను పంచుతుందని, రవిప్రకాష్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని దర్శకుడు తెలిపారు. బలమైన కథతో ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని రవిప్రకాష్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్, రచన–దర్శకత్వం: రాజేశ్ తడకల.

# వీఎన్ ఆదిత్య సినిమాకోసం ఆడిషన్స్



'మనసంతానువ్వే' దర్శకుడు వీఎన్ ఆదిత్య దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఓఎంజీ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ మీనాక్షి అనిపిండి ఈచిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ విషయాన్ని అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో గల లాకింట బంకెట్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా నిర్మాణం కూడా డల్లాస్‌లోనే జరుగనున్నదని, త్వరలోనే సెట్స్‌కు వెళ్లనున్నామని మేకర్స్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ సినిమాకు సంబంధించిన ఆడిషన్స్‌ని నిర్వహించారు. ప్రవాస భారతీయులతోపాటు అమెరికన్స్, స్పానిష్ పీపుల్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్, మరీ ముఖ్యంగా తెలుగు, తమిళ, కన్నడ వారు కూడా భారీ సంఖ్యలో ఈ ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. ఈ పరిణామంపై దర్శకుడు వీఎన్ ఆదిత్య ఆనందం వ్యక్తం చేశారు.